

# అన్వేషణ

కె.కె. మీనన్

ప్రియంవద నుంచి దూరంకావటం నా జీవితంలో ఒక విషాద సంఘటన గానే నేను భావిస్తున్నాను. అది అంత తేలిగ్గా మర్చిపోయే విషయం కాదు. మర్చిపోయావని సంతృప్తిపడటం మాత్రం తేలికే.

* * *

రంగు రంగుల దీపాలు కాలేజీ ఆడిటోరియంను ప్రకాశవంతం చేస్తున్నాయి. లోపల మాలలుగా వేళ్ళాడదీసిన పూలు ఆడిటోరియం అంతా సుగంధపూరితం చేస్తున్నాయి. కొంతమంది ఉత్సాహంగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ప్రియంవద (నాకు కావల్సిన భార్య) మాత్రం ఏదో పోగొట్టుకున్నదాన్లా దిగులుగా, నిర్లిప్తంగా వుంది. నాకూ ఇంచుమించు అలాగే వుందని చెప్పాలి.

అది కాలేజీలో ఆఖరు సంవత్సరం విద్యార్థులకు యిచ్చే వీడ్కోలు ఉత్సవం. మమ్మల్నిద్దర్నీ కలిపిన ఆ కాలేజీ ఇక మాకు ఏమీ కాదు. అంచేత మా మధ్య ఏర్పడ్డ అనురాగబంధం కూడా అవాళ్టితో పుటుక్కున తెగిపోతుందేమోనని ఇద్దరికీ బెంగగానే వుంది.

వేసవి కాలపు వెచ్చటి చీకటి. ఆగమిస్తోన్న ఆ అంధకారం మా అనుబంధానికి ఆఖరిఘడియలు మోసుకొస్తున్నట్టుగా వుంది.

తీయటి రోజులు అంతరించిపోతున్నాయి.

చేదు జీవితానికి ఉషోదయం కాబోతోంది.

దుష్టప్రపంచం తన వికృత క్రీడల కోసం మమ్మల్ని ఆహ్వానిస్తోంది.

'రుక్ జావో జానేవాలా రుక్ జా....'

మైకులోంచి పాట సన్నగా వినిపిస్తోంది.

ఆ పాటలోనే మా యెడబాటు

దోబూచులాడుతున్నట్టు అనిపిస్తోంది.

ప్రియంవదా నేనూ సన్నిహితం కావటానికి కారణం మా యిద్దరిలో వున్న కొన్ని భావాల సామ్యతే. చిత్తశుద్ధిగల అందరిలాగే మేమూ మానవుడిలోని రెండు దుర్గుణాలని ద్వేషించేం. అవి: వంచన, స్వప్రయోజనాలకోసం ఇతర్లని దోచుకోవటం. వాటిని నేను ద్వేషించినంత తీవ్రంగా ప్రియంవద ద్వేషించ లేదేమోనని తర్వాత తర్వాత అనిపించింది. లేకుంటే మేం విడిపోయే దురదృష్టకర సంఘటన సంభవించేదే కాదు. 'దోపిడీ' అనే గుణం మానవ జీవితానికి ప్రాథమిక అవసరమే అనుకుంటే, లేదా; లక్షణమే అనుకుంటే, అసలు మానవ జీవితమే ఒక దుష్టశక్తిగా భావించాల్సి వుంటుంది. మార్క్సిస్టు భావజాలంలోని 'దోపిడి' గురించి నేనంతగా పట్టించుకోను. ఎంచేతనంటే, ఈ విధానంలో కార్మికుడి చెమటనుంచి పెట్టుబడిదారు లాభాల్ని పిండుకునే ప్రయత్నం ప్రత్యక్షంగానే చేస్తాడు. ఇది స్పష్టమూ, నిర్హేతుకమూ అయిన క్రియ. కాని, మానసికంగా ఒకళ్ళనొకళ్ళు దోచుకునే సున్నితమైన, బాధాకరమైన 'దోపిడీ' విధానంపట్లే నాకు తీరని వైముఖ్యం ఏర్పడింది. ఏ రూపంలోనూ ఒకరిముందు చేయిచాచటం అంటే నాకు కిట్టదు. సహాయం చేసిన వ్యక్తికి కృతజ్ఞత తెల్పుకోవటం అనే అత్యల్ప విషయం కూడా నాకు బాధాకరంగానే వుంటుంది. మానవజాతి మనుగడకు శాపంగా పరిణమించిన యీ 'దోపిడీ' నుంచి సాధ్యమైనంత దూరంగా వుండాలనే ఎప్పుడూ నా ప్రయత్నం. కాని, పెళ్ళిచేసుకోవాలని తీసుకున్న నిర్ణయమే యీ 'దోపిడీ'తో రాజీపడటానికి నేను చేసిన ప్రయత్నం. మానవజాతి చరిత్ర ఎరిగినంత మేరకు మానసికోద్రేకాల దోపిడీకి మంచి ఉదాహరణ ఈ 'దోపిడీ'యేనని నా గట్టి నమ్మకం.

ఉత్సవం ముగిసిపోయింది.

మిత్రులంతా ఒకళ్ళనొకళ్ళు కౌగలించుకుని వీడ్కోలు చెప్పుకుంటున్నారు. ప్రియంవద నా దగ్గరకంటా వచ్చి చేయి పట్టుకున్నది.

"ఇవాళ ఇంటిదగ్గర దిగబెట్టాలి."

అప్పుడు అభ్యంతరం చెప్పేనో లేదో ఇప్పుడైతే గుర్తురావటంలేదు గాని ఆమె వునికి మాత్రం భారంగా తోచినట్టు జ్ఞాపకమే.

వేడుకలు ముగిసి బైటపడేప్పటికి వేళ మించిపోయింది. ఆకాశం మేఘావృతం అయింది. గాలి దుమారం....

మెయిన్ రోడ్డుమీద నడుస్తున్నాం.

దగ్గరగా వచ్చి నడుంచుట్టూ చేయి వేసింది ప్రియంవద.

"కొంచెం దూరంగా నడు ప్రియా. ఎవరైనా చూస్తే బాగుండదు."

ముఖం మాడ్చుకుని వుంటుంది.

రోడ్లు ఇంకా రద్దీగానే వున్నాయి.

పేవ్‌మెంటుమీద బిచ్చగాళ్ళు తప్పితే ఎవరూ లేరు. అంతవరకూ మా ముందు పేవ్‌మెంటుపైన పడుకునివున్న బిచ్చగాడు అకస్మాత్తుగా లేచి రోడ్డుకు అడ్డం పడి పరిగెత్తేడు. అంత వేగంగా పోయే బస్సులు, లారీలు, టాక్సీలు — ఒక్కదానికి బ్రేకులు పడ్డట్టు లేదు.

అవతలి పేవ్‌మెంటుమీద కుక్కలు కొట్లాడుకుంటోన్న హడావుడి విన్పిస్తోంది.

గుండెలు గుబగుబలాడేయి. ఆ వాహనాల్లో ఏదో ఒకదానికింద పడి అతను దిక్కులేని చావు చచ్చివుంటాడని భయపడ్డాను.

'ఏదో పెద్ద దోపిడీగాడు .... గ్రేట్ ఎక్స్‌ప్లాయిటర్' అనుకున్నాను.

భవిష్యత్తు గతం ఇనుపగుప్పెట్లో ఇరుక్కుపోయినట్లు భయంకరమైన అనుభూతి.

నిజమే కావచ్చు.

ఆ బిచ్చగాడు ఉన్న స్థలాన్ని ఒదిలి అలా మరో జీవితాన్ని వెదుక్కుంటూ పరిగెత్తటం.... లారీకిందా, కారుకిందా పడకుండా తప్పించుకుని అవతలి పేవ్‌మెంటు మీదికి పోయి హోటలువాళ్ళు విసర్జించిన పులివి స్తరాకులకోసం కుక్కలతో పోరాడటం....

ఆ క్షణంలో మా స్వేచ్ఛను ఎవరో దోచేసుకున్నట్టే అనిపించింది.

చినుకులు ప్రారంభమయ్యేయి.

"కాస్సేపు హోటల్లో కూర్చొందాం." అంది ప్రియంవద.

రెస్టారెంటులో కూర్చుంటే కాలం స్తంభించిపోయినట్టుగా అన్పించింది. నిశ్చల నిర్వర ప్రపంచంలో చిక్కుకుపోయినట్టు భావన. ఎవరో ఏవేవో మాటలు మాట్లాడుకుంటున్నారు. ప్రియంవద కూడా తన సహజ ధోరణిలోనే స్వేచ్ఛగా మాట్లాడుతోంది. అయినా భరించలేనంత నెమ్మదిగా విన్పిస్తున్నాయి మాటలు. నిద్రలోకి జారుకుంటూ సంగీతం వింటూవుంటే, రాగం నీరసంగా సాగి మౌనంలో అంతర్లీనమైపోతున్నట్టూ.... తీగమీద రాగం తెగిపోతున్నట్టూ....

"....నువ్వు ఆఫీసుకి వెడితే.... నేను ఇంటిదగ్గర నీకోసం నిరీక్షిస్తూ వుంటే.."

"ఎప్పుడూ ఇలా ఎదురెదురుగా కూర్చొని భోంచేస్తూ వుంటే .... ఏం థ్రిల్...."

"అంతకంటే థ్రిల్ మనం. .."

"ఊ.... ఆపెసెయ్ .... ఇది కల కాదు. జీవితం..."

* * *

సంవత్సరం తిరక్కుండానే ప్రియంవదతో నా సంబంధాలు తెగిపోయేయి. 'దోపిడీ' దీనికి కొంత దోహదం చేసింది. ఇద్దర మూ కోరుకున్నది ఒక్కటే, స్వేచ్ఛగా వుండాలనుకోవటం.



అది కేవలం సిద్ధాంతంగానే మిగిలి పోయింది.

ఏం కావాలని ఆమె నన్ను కోరుకుంది?

ఏం ఇవ్వలేదని మళ్ళీ కాదని విడిపో యింది?

మానసిక వుద్రేకాలని తీర్చుకోలేక పోవటమే, ఒకళ్ళనొకళ్ళు దోపిడీకి గురి కాకుండా వుండిపోవటమే.... జవాబు లేని ఈ ప్రశ్నలకు జవాబుగా మిగిలింది.

ఉత్పత్తి చేసేవాళ్ళు...పెట్టుబడి పెట్టే వాళ్ళు.... ఒకళ్ళపై ఒకళ్ళు ఆర్థికంగా ఆధారపడి వుండటంవల్లే వర్గపోరాటం అనివార్యం అవుతోందని కాలేజీలో విన్న పాఠాలు మరొక్క సారి గుర్తుకు వచ్చేయి.

ఇందులో ఎవర్నీ నిందించాల్సిన అవ సరం కన్పడదు.

నా చాతగానితనంగానే సంతృప్తి పడతాను.

వర్షంనుంచి వేరుపడి సముద్రంలో

కల్సిన నీటిబిందువు వంటిది ప్రియంవద. జీవితాన్ని సమగ్ర వర్షపాతంతో పరి పోల్చుకోవాలి గాని, చెదిరిపోయిన ఏవో కొన్ని నీటితుంపరల్ని సంయోగపర్చ టంలో కాదు. అంచేతనే మగాడు 'ఇంటి గ్రేషన్' కంటే 'డిఫరెన్సియేషన్' సుల భంగా చేయగల్గుతాడని నా అభిప్రాయం. దేమ్ ఇజ్ ది మేథమేటిక్స్....

ప్రియంవద సముద్రంలో కురిసే వర్షంలో ఏకాంత బిందువుగా మారు తోంది. అంచేత మా మధ్య దూరం ఏర్పడినందుకు నన్నే నేను అభినందించు కోవాలేమో! అయినా ఆమె స్మృతులు ఇంకా నన్ను వెంటాడుతూనే వున్నాయి. వల్పటి నీటిబొట్టులా ఇంకా ఆమె రూపం మెదుల్తూనే వుంది.

కన్నీటితో ఆమె రూపాన్ని కడిగేసు కుంటున్నాను.

• • •

ఒక రకమైన నైతిక అంధకారంలో పడి ప్రపంచాన్ని సరిగా చూడలేక పోయానేమోనని ఇప్పటికీ అనుమానం కల్గుతూ వుంటుంది. కాని, నేను చెప్ప బోయే సంఘటనవల్ల నా మనస్సుకు అలాంటిదానితో ఏమీ సంబంధం లేదని స్పష్టమౌతుంది.

పలాయనవాదం నన్ను ఉన్నచోటి నించి తరిమేసింది. తెలీని దేనికోసమో అన్వేషించుకుంటూ దేశాలు తిరిగేను. ఆ ముసుగులో తలదాచుకుని మంచి చదు వులు కూడా చదివేను. చివరికి హైదరా బాదులో తేలేను.

మంచి ఉద్యోగం.... హోదా....


అన్నీ వున్నా ఏదో లోపం.... అసం తృప్తి.

హైదరాబాదు వచ్చిన కొత్తలో అత్యు స్యాత్తుగా నూతన జీవితాన్నీ.... మానవ హృదయాన్నీ.... నాలో చూడగలిగేను.

హైదరాబాదు చారిత్రక నగరం. పురా తన వైభవానికి కొండగుర్తులు ఇక్కడ చాలా వున్నాయి. అందులో గోల్కొండ ఒకటి. గోల్కొండ ఒక శ్మశానవాటిక కంటే భిన్నంగా కన్పించలేదు నా దృష్టికి. తాజ్‌మహల్ అయినా అంతే.... నిలువు 'దోపిడీ'కి గురైన మానవుల సమాధులివి.

పురావస్తు శాఖవారు దీన్ని భద్రపరు స్తున్న తీరు నా మానసిక సౌకుమార్యాన్ని కొంచెం మలినపర్చింది. ఎండ తీవ్రత, ఒంటి చిటపట నా సహనాన్ని దోచేస్తు న్నాయి. శ్మశానంలాంటి ఆ పాత కట్టడంమీద రోతపుట్టి, ఎత్తువల్లాలమీద ధైర్యంగా అడుగులు వేసుకుంటూ సమ తల ప్రదేశంకోసం అన్వేషణ ప్రారం భించేను.

కోట వెలుపల సమతల రోడ్లమీద కూడా అక్కడక్కడా మృత్యువు పొంచి చూస్తూవుంటుంది. అది ఒక్కసారి నా ముఖంలోకి తొంగిచూసి వెనక్కి తప్పు కుంది.




రోడ్డుకి అవతలపక్క ఒక టూరిస్టు బస్సు ఆగివుంది. అందులోంచి పర్యాటకులు బైటికి రావటం కూడా కన్పించింది. నేను అక్కడికి చేరుకునేటప్పటికే వాళ్లు రోడ్డు దాటుకుని కోటవైపు వెళ్ళిపోతున్నారు. ఒక యువతి మాత్రం మిగిలిపోయింది. కందిరీగలాంటి నడుం.... ఒత్తయిన వుంగరాల జుట్టు.... స్లీవ్‌లెస్ జాకెట్టు....

బృందాన్ని కలుసుకోవాలనే ఆతృతతో నన్ను చూడకుండగనే రోడ్డుమీదికి పరుగెత్తింది.

అంతే–

మళ్ళీ గతం గుప్పెట్లో భవిష్యత్తు బందీ అయింది.

హారన్ కోసం వృధా ప్రయత్నం చేసేను. కండరాలు పనిచేయలేదు.

మేధస్సు పూర్తిగా చీకట్లో మునిగింది.

వెలుగులోకి వచ్చేప్పటికి, సీట్లో వెనక్కి చేరబడి వున్నాను. చేయి ముఖం మీద వుంది. పగిలిన గాజు పెంకులు చెల్లాచెదురుగా పడివున్నాయి.

కారు ముందు — స్పృహలేని ఆ అమ్మాయి.

ఎండ తీక్షణతకి తట్టుకోలేక చేయి అడ్డం పెట్టుకున్నాను. ఇంతలోనే ఇది జరిగిపోయింది.

తీరా చూస్తే—

ఆ అమ్మాయి లేదు.

విండ్‌స్క్రీన్ పగల్నూ లేదు.

అవతలపక్క తనవాళ్ళతో కలిసి హాయిగా నవ్వుతోంది ఆ అమ్మాయి.

అప్పుడు గుర్తించేను.

నేను అనుకున్న 'నేను' అసలు నేనే కాదు.

నేను అనుకున్న ఎవరూ, ఎవరూ కారు.

నన్నెవరూ దోచుకోలేదు.

ప్రియంవద నా ఉద్రేకాల్ని 'దోపిడీ' చేసి మానసికంగా హత్యచేసే ప్రయత్నమూ చేయలేదు. అసలు 'నేను' నేనే లేను. దోచుకోబడిన 'నేను' మాత్రమే మిగిలివున్నందుకు అదో సంతృప్తి. అంతరాంతరాల్లో దాక్కొని కేవలం గాయపడడానికి మాత్రమే అప్పుడప్పుడూ తొంగిచూసే ఆ 'అంతరాత్మ' కేవలం కల్పన.

నేను సమాజంలోని ఒక వ్యక్తిననీ, నా చుట్టూ ఇంకా మనుషులున్నారనీ తొలిసారిగా గుర్తించేను. మిగిలినవారికీ అంతరాత్మలు ఉన్నాయనీ అవి కేవలం నాటకంగా భావించటం తప్పనీ అప్పుడే తెల్సుకున్నాను. చెదిరి పడివున్న గాజు ముక్కల్లో నా రూపాన్ని చూసుకున్నాను. అదే సమాజ స్వరూపం కూడాను. నా మిత్రులూ, శత్రువులూ ... అందరూ అందులోని ప్రతిబింబాలే.

ఆ రోజునుంచీ నగరం నాకెంతో ప్రీతిపాత్రంగా మారింది శాంతిదాయకమూ అయింది. జరగని ఆ ప్రమాదంలో ఊహించుకున్న దృశ్యమే ఇందుకు కారణం కావచ్చు కాని, అంతకంటే భిన్నమైన ప్రభావం ఏదో నామీద పన్జేసింది.


ఎలాగైతేనేం భవిష్యత్తు గతం గుప్పెట్లోంచి జారిపడింది.

• • •

ఊహాజనితమైన ఏవో ఆదర్శాల అన్వేషణలోనే నా జీవితం చాలాభాగం గడిచిపోయింది. జీవితపు అంచుమీద కూర్చొని ఇప్పుడైనా ప్రశాంతంగా బతగ్గలనో లేదో తెలీదు. కాని, ఒక్కటి మాత్రం స్పష్టం. నా మనస్సులో ఇంత దాక తిష్టవేసుకూర్చొన్న 'మానవతా విలువలు' మాత్రం నన్ను వేధించటం మానేశాయి. దానికి బదులు మానవ జీవితంలోని 'త్యాగం' నన్ను ప్రభావితం చేయటం ప్రారంభించింది. ఈ జగత్తుని జయించటంకోసం నాలోని 'నేను'ని త్యజించాల్సిన అవసరాన్ని గుర్తించాను

'ఉనికి' 'మిథ్య' అనే పదాలు రెండూ పరస్పరాధారాలు. గడ్డిపోచలో స్వర్గాన్ని దర్శించగలగాలి గాని, స్వర్గంకోసం హిమాలయాల్లో గోచీపెట్టుకుని తపస్సు చేయాలనుకోవటం అవివేకం.

సాయంత్రం బషీర్‌బాగ్‌లోని ఒక ఖరీదైన హోటలుకి భోజనానికి వెళ్ళేను. పాశ్చాత్య దుస్తుల్లో వున్న వెయిటర్సు.. అద్భుతంగా కన్పించే లోపలిఅలంకరణ, ....సమశీతల వాతావరణం – ఇవన్నీ ఒట్టి బూటకాలుగాఅన్పించేయి. కుర్చీలో కూర్చొన్న రంగుల తలపాగా సర్దార్జీ ఇచ్చే బిల్లు ఒక్కటే సత్యం.




ఎవరో, ఎవరో దోపిడీచేస్తున్నట్టు భావించటం నాకు మానసిక అభ్యాసం అయిపోయింది. నా ముందున్న భోజనం, మనుషులు అంతా నన్ను దోపిడీ చేస్తున్నట్టుగానే భావిస్తాను.

వెంటనే మళ్ళీ సరిదిద్దుకుంటాను.

నేను వూహించుకుంటున్నట్లు ఎవరూ నన్ను దోచుకోవటంలేదు. ఆ ఖరికి ప్రియంవద కూడా నన్ను దోపిడీ చేయలేదు.

సప్లయిర్ వెండిగిన్నెలో బిల్లు తీసుకొచ్చేడు.

నా ఆలోచన సాగుతూనే వుంది.

"భాయీసాబ్...."

సర్దార్జీ నా ముందు నిలబడివున్నాడు.

"ప్లీజ్...."

టాంగాకోసం వేచివున్న దంపతుల వైపు చూపించేడు.

లేచాను.

కృతజ్ఞతా పురస్కారంగా ఆ దంపతులు కనీసం నావైపు చూసి నవ్వనైనా నవ్వలేదు.

టిప్స్ జేబులో వేసుకున్న వెయిటర్లు కూడా నవ్వలేదు.

సర్దార్జీ మాత్రం నవ్వేడు.

వినయపూర్వకంగా తలవంచి కృతజ్ఞత ప్రకటించేడు.

బడాచోర్....గ్రేట్ ఎక్స్ప్లాయిటర్..

ఒక గొప్ప ప్రయోజనాన్ని ఆశించి మాత్రమే నవ్వేడు.